# నాన్నా! నేను హిందువునా?

"డాడీ! యామ్ ఐ ఎ హిందూ?"

"యస్! యు ఆర్ మై డియర్"

"హవ్ యామ్ ఐ ఎ హిందూ?"

"నువ్వు హిందువుగా పుట్టావు కనుక"

"హిందువుగా పుట్టటమే కానీ ప్రాక్టీస్ చేయటం లేదు కదా!"

"చేయొద్దని ఎవరన్నారు. చేయి!"

"నేను అమెరికాలో పుట్టి పెరిగాను. మరి నాకు హిందూమతం గురించి ఏమీ తెలీదే. చెబుతావా?"

"తప్పకుండాను... ఏం కావాలో అడుగు"

"రాముడు కృష్ణుడు కథలన్నీ వినటానికి బాగుంటాయి కానీ, అవి నాకు ఫాంటసీ కథల్లా వుంటాయి. అవన్నీ చదివాను కూడా. సూపర్ మేన్, స్పైడర్‌మేన్ కథల్లాగా. నాకు అసలు సిసలైన హిందూ ఫిలాసఫీ ఆఫ్ లైఫ్ గురించిచెబుతావా?"

"రామాయణం భారతం కథలు కావు. నిజంగా జరిగినవే. వాటి గురించి కుర్రకుంకవి నేకేం తెలుసు? అసలు మిగతా మతాలన్నీ మన మతంలోనించే వచ్చాయి. తెలుసా? నిజంగా హిందు అన్నది ఒక మతం కాదు సనాతన ధర్మం... "

"మిగతా మతాలు మన మతంలోనించే వచ్చాయంటున్నావు. మళ్ళీ మనది ఒక మతం కాదంటున్నావు. నువ్వు చెప్పిందే నువ్వు కాదంటున్నావేమిటి"

"అలా ప్రశ్నించకూడదు. తప్పు. కళ్ళు పోతాయి. అవన్నీ మన వేదాలూ ఉపనిషత్తుల్లో వున్నాయి"

"వేదాలు, ఉపనిషత్తులు ఎన్ని? ఎవరు వ్రాశారు? వాటిల్లో ఏముంది.... "

"అవా.. అవీ.. నికేదన్నా మంచి పుస్తకం కొనిస్తాను. చదువుకుందువుగాని"

"అయితే నీకూ తెలీదన్న మాట. నువ్వు కూడా వేదాలూ ఉపనిషత్తులూ చదవలేదన్న మాట. ఊరికే చెబుతున్నావు అన్నీ తెలిసినట్టుగా..."

"నాకు అవి తెలీకపోయినా, వాటి గురించి తెలుసు. మీ తాతయ్య వాటి గురించి చెబుతూ వుండేవారు"

"మరి తాతయ్య అవన్నీ బాగా చదివి అర్థం చేసుకున్నారా?"

"ఏమో నాకు తెలీదు. బహుశా మా తాతయ్య ఆయనకి చెప్పారేమో"

"అయితే ఒకళ్ళు చెప్పారని మనం అలా వినేయటమేనా? మనంతట మనం చదువుకుని అవి చక్కగా అర్థం చేసుకోవద్దూ"

"రెండూ రెండూ కలిపితే నాలుగని మీ టీచర్ చెబితే నువ్వు వినలేదూ... ఆ టీచర్‌కి వాళ్ళ టీచర్ చెప్పలేదూ... ఇదీ అలాగే"

"నీ మాటల్లో లాజిక్ లేదు. ఆ టీచర్ లాజికల్‌గా చెబుతాడు"

"అలా అయితే భగవద్గీత, వేదాలు, ఉపనిషత్తులూ క్షుణ్ణంగా చదువుకు

న్నవాళ్ళ దగ్గరే తెలుసుకుందువుగాని. ఫలానా ఆయనకి ఫోన్ చేస్తాను"

"అయితే ఇద్దరం కలిసే ఆయన దగ్గరికి వెడదాం. హిందూమతం గురించి తెలుసని అనుకుంటున్నావు కానీ, నీకేమీ తెలీదని తెలుస్తూనే వుంది. హిందూమత ంగురించి మాట్లాడే ముందు అదేమిటో తెలుసుకోవటం అవసరం కదూ... "

*　　*　　*

"ఏమండీ! సముద్రాలగారు ఏనాడో ఒక పాట వ్రాశారు. ఆ పాటలో ఒకా విడ సృష్టిని చేసిన భగవంతుడు నాశనాన్ని ఎందుకు సృష్టించాడనీ, వెలుతురిచ్చిన దేవుడే చీకటినెందుకు ఇచ్చాడనీ, కళ్ళు ఇచ్చిన దేవుడే మరి అంధులని ఎందుకు సృష్టించాడనీ జీవితాన్నిచ్చిన దేవుడు మరి చావునెందుకు సృజించాడనీ, ఇలాటి ప్రశ్నలెన్నో అడుగుతుంది. దానికి ఇంకొకావిడచేత ఆయన జవాబు చెప్పించారు. ఎన్నో వేదశాస్త్రాలు చదివినవాళ్ళకే ఆ సృష్టి రహస్యం బోధపడలేదనీ, వాటి ప్రశ్నించటానికి నువ్వెంత, నీ అల్పబుద్ధితో ఆ జ్ఞానదాతని పరిహాసం చేస్తున్నావా అని. ఆ రోజుల్లో ఏమోగానీ ఈ రోజుల్లో ఎదిగే పిల్లలు బాగా మారిపోయారు. వాళ్ళకి లాజికల్ వివరణ కావాలి. అలాటప్పుడు "వెధవా! ఇలాటివాటిని ప్రశ్నించే అంతవాడివయావా" అని తొక్కేసే బదులు, జ్ఞానసముపార్జనకోసం అడుగుతున్న ఆ చిన్నారులకి దారి చూపించటం మన బాధ్యత కాదూ! పూజలూ, పురాణాల కన్నా ఇది ముఖ్యంకాదూ? ఇటు పరీక్షల్లో పాసవటంకోసం దేవుడితో బేరం పెట్టు కుంటూనే, వేదపండితులనీ ఘనాపాటీలనీ చులకన చేయటంవల్ల ఎవరికి నష్టం? మతంలో అవసరమైనది సమ్మతం అవాలి కానీ మూఢమైన వాటిని నమ్మితే ఏమిటి ప్రయోజనం. సంస్కృతంలోని పుస్తకాలని అందరికీ అర్థమయే సులభమైనఇంగ్లీషు లోనూ, తెలుగులోనూ సామాన్యులకి అందజేయటం అవసరం కాదూ? కుక్క గొడుగుల్లా పుట్టుకొస్తున్న డొనేషన్ కాలేజీలమీద చేసుకుంటున్న డబ్బుల్లో కనీసం ఒక చిన్న శాతం ఖర్చుపెట్టి, అక్కడక్కడా కొన్ని ఉచిత వేద పాఠశాలలు పెట్టటా నికి ఉపయోగించవచ్చు కదా!"

"అవును! అమెరికాలో ప్రతిరోజూ, ప్రతిచోటా, ప్రతి విషయంలోనూ ఎంతో అవసరమని చెప్పేది కమ్యూనికేషన్. మనకీ మన మతానికీ ఆ కమ్యూనికే షన్ గాప్ వున్నంత కాలం మనమలా ఆ మిడిమిడి జ్ఞానంతోనే వుంటాం. ఏవో కొన్నిచోట్ల మంచి ప్రయోగాలూ, ప్రయత్నాలూ జరుగుతున్నాయి కానీ అది చాలదు. అయోధ్యలో మసీదు పడగొట్టటం బట్టలు విప్పుకుని ముఖమంతా బూడి ద పులుముకుని, సూదులు గుచ్చుకునేలాటి కార్యక్రమాల బదులు, ఇలాటి క్రియాత్మకమైన పనులు చేయటం ఎంతో అవసరం కాదూ!"

*　　*　　*

"ఈరోజు మనమందరం ఇక్కడ కలవటం నాకెంతో సంతోషంగా వుంది. న్యూయార్క్‌నించీ ప్రముఖ వేదాంతి వేదాంతంగారు రావటం మన అదృష్టం. ఇందాకటినించీ ఆయన చెప్పిన మంచి విషయాలన్నీ మనందరం ఓపిగ్గా విన్నాం. ఆయన శ్రమపడి చెప్పినందుకూ, మనమందరం ఎంతో విలువైన సమయాన్ని

వెచ్చించి ఇక్కడికి వచ్చినందుకూ, మనం చేయవలసిన పని మన పిల్లలకి ఇవన్నీ అర్ధమయేలా చెప్పటం. ఈ అమెరికాలో రకరకాల మతాల మధ్య జీవితాన్ని చూస్తున్న మన పిల్లలకి హిందూ మతం మీద ఉత్సాహం కలిగించటం అవసరం. ఇవాల్టినించే ఆ పని ప్రారంభిద్దాం! ఎవరైనా ప్రశ్నలడగాలంటే అడగవచ్చు"

"వేదాంతంగారూ! మా ఇద్దరు అమ్మాయిలూ అమెరికాలోనే పుట్టి పెరిగారు. పెద్దమ్మాయి హైస్కూల్లోనూ చిన్నమ్మాయి మిడిల్ స్కూల్లోనూ చదువుతున్నారు. మన రామాయణ భారతాలు, కామిక్స్‌నించీ రాజగోపాలాచారిగారి ఇంగ్లీష్ రామాయణం దాకా చదివించాం. మన పౌరాణిక సినిమాలు కూడా వీలున్నప్పుడల్లా కూర్చోబెట్టి చూపిస్తూనే వున్నాం. ఏదో బలవంతంగా చూశారేగానీ హిందూ మతాన్ని అర్ధం చేసుకోలేదు. అసలు హిందూ మతంలో ఏముందో చెప్పమని నిలదీస్తారు. మా వూళ్ళో పూజారిగారు కూడా కృష్ణుడు వేలితో గొవర్ధన పర్వతం ఎత్తాడని చెబుతాడే కానీ, వాళ్ళకి కావలసింది చెప్పడు. వాళ్ళు మొండిగా తయారవుతున్నారు. హిందూమతం మీద వాళ్ళకి ఏంచేస్తే ఉత్సాహం వస్తుందంటారు?"

"మంచి ప్రశ్న అడిగారు మీరు. దానికి ఒకటే మార్గం వుంది అని నేననను. కానీ ఆ ఉత్సాహం కలిగించటానికి నేను అవలంభించిన పద్ధతి చెబుతాను. అది మా అబ్బాయి విషయంలో పనిచేసింది కనుక, మీరూ ప్రయత్నించండి. నష్టంవుండదు. వివేకానందుడివీ తదితరులవీ సులభ శైలిలో వ్రాసిన మంచి పుస్తకాలు ఎన్నో వున్నాయి. పురాణాలు వద్దు. మీ పిల్లల తెలివితేటలకి సమానమైన రెండు మూడు రకాల పుస్తకాలు కొనండి. ఆ పుస్తకాలు పిల్లలకి ఇవ్వద్దు. అవి వాళ్ళు చదవటానికి కొన్నామని కూడా చెప్పకండి. రోజూ వాళ్ళు టీవీ చూస్తారు కనుక ఒక పుస్తకం అక్కడే టీపాయ్‌మీద కనపడేటట్టు పడేయండి. అలాగే ఇంట్లో ఇంకొక చోట. మీరు ఆ పుస్తకాల గురించి కూడా వాళ్ళతో ఏమీ మాట్లాడవద్దు. వాళ్ళు పుస్తకాల వేపు చూసినా చూడకపోయినా వాటిని అలాగే వదిలేయండి. అక్కడ ఇంకా వేరే పుస్తకాలు ఏవీ వుంచద్దు. మీకు సాధ్యమయితే వాళ్ళు ఆ గదిలోవున్నప్పుడు మీరు ఇంకో గదిలోకి వెళ్ళండి. ఒకటి రెండు రోజుల్లో అట్టమీద బొమ్మ, పుస్తకం పేరూ చూసి వదిలేస్తారు. తర్వాత కొన్నిరోజుల్లో టీవీలో ఏ అడ్వర్‌టైజ్‌మెంటో వచ్చినప్పుడు పుస్తకం తీసుకుని పేజీలు తిరగేస్తారు. కొన్నాళ్ళల్లో ఆ పుస్తకం చదివేయటం, అంతే కాకుండా మీరు అక్కడా ఇక్కడా వదిలేసిన అలాటి పుస్తకాలు చదవటం మీకు ఆశ్చర్యం కలిగిస్తుంది. అలా జరిగిన తర్వాత, వాళ్ళ పుట్టిన రోజుకి బహుమతిగాకూడా అలాటి పుస్తకాలు ఇవ్వటం మంచిది"

* * *

"డాడీ! ఆర్ యు ఎ హిందూ?"

"అవును. కాదు. పుట్టుక వల్ల నేను హిందువునే. ఇప్పుడు హిందూమతం అంటే ఏమిటో తెలుసుకుంటున్నాను. అప్పుడు నిజంగా హిందువునవుతాను!"

* * *